

ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 02-01-2026 | సంపుటి - 26 | సంచిక -225 | రూ : 4 | పేజీలు: 8


2లో

## హైదరాబాద్‌లో ప్రశాంతంగా
# 2026 వేడుకలు..

- ప్రమాదాలు లేకుండా ముగిసిన హైదరాబాద్ న్యూ ఇయర్ వేడుకలు
- ఫలించిన పోలీసుల పటిష్ఠ బందోబస్తు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపిన కమిషనర్ సజ్జనార్
- డిసెంబర్ నుంచే కఠిన చర్యలు తీసుకోవడంతో మంచి ఫలితం

## మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే వీళ్లిద్దరినీ
# రాళ్లతో కొట్టి చంపుతారు


2లో

- రాజకీయ ప్రయోజనాల కోసమే కేసీఆర్ జలవివాదాన్ని రెచ్చగొడుతున్నారన్న రేవంత్
- గత ప్రభుత్వం తెలంగాణకు 34 శాతం వాటాకే అంగీకరించి అన్యాయం చేసిందని ఆరోపణ
- కేసీఆర్, హరీశ్‌ల సంతకాలు తెలంగాణ పాలిట మరణ శాసనం అన్న రేవంత్
- 'నీళ్లు-నిజాలు' పేరుతో ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నేతలకు అవగాహన కార్యక్రమం
- జలవివాదాల అంశంపై కాంగ్రెస్ ముఖ్య నేతలతో సీఎం ఉన్నత స్థాయి సమావేశం


2లో

## 2025లో పెరిగిన తిరుమల శ్రీవారి లడ్డూల అమ్మకం..

- డిసెంబరు 27న రికార్డు స్థాయిలో విక్రయాలు
- 2025లో రికార్డు స్థాయిలో శ్రీవారి లడ్డూల విక్రయాలు
- మొత్తం 13.52 కోట్ల లడ్డూలను విక్రయించిన టీటీడీ
- 2024తో పోలిస్తే 1.37 కోట్ల లడ్డూలు అదనం
- భక్తుల రద్దీ, నాణ్యతపై నమ్మకమే అమ్మకాలు పెరగడానికి కారణం

## కుట్రదారుల ముసుగులు
# తొలగిపోయాయి

### యూనస్ సర్కార్‌పై షేక్ హసీనా ఫైర్

- మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వంపై షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు
- అవినీతి, స్వార్థంతో దేశాన్ని చీకట్లోకి నెడుతున్నారని విమర్శ
- దేశాన్ని కాపాడేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపు
- ప్రపంచవ్యాప్తంగా బంగ్లాదేశ్ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని ఆవేదన


2లో

- కొత్త ఏడాదిలో నిర్ణయాత్మక ఫలితం చూస్తామని ధీమా

## తెలంగాణలో రికార్డు స్థాయిలో
# మద్యం విక్రయాలు


2లో

- డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.1.000 కోట్ల మద్యం విక్రయాలు
- చివరి మూడు రోజుల్లో 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీర్ల విక్రయాలు
- డిసెంబర్ 30న రూ.520 కోట్ల అమ్మకాలు

## భారత్‌లో చిక్కుకున్న హెచ్-1బీ ఉద్యోగులకు
# అమెజాన్ బంపరాఫర్




- హెచ్-1బీ వీసా జాప్యంతో భారత్‌లోనే ఉండిపోయిన అమెజాన్ ఉద్యోగులు
- 2026 మార్చి 2 వరకు ఇంటి నుంచే పని చేసేందుకు అనుమతి
- కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ వంటి పనులు చేయకూడదని కఠిన ఆంక్షలు

2లో



## 2025లో ఏపీ ప్రస్థానంపై
# జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం

- ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన
- తిరిగి ప్రారంభమైన అమరావతి రాజధాని నిర్మాణ పనులు
- విశాఖలో గూగుల్ భారీ డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటన
- రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఆకర్షణ
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రభుత్వ ప్రణాళికలు
- 'సూపర్ సిక్స్' హామీల అమలుతో పరుగులు తీస్తున్న సంక్షేమం

2లో

# ఆపరేషన్ సిందూర్ తో డీఆర్డీవో ఆయుధాల సత్తా ఏంటో అందరికీ తెలిసింది

ఢిల్లీ: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంస్థ సేవలను కొనియాడారు. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయని, మన దేశీయ ఆయుధాల సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందని అన్నారు. ఇది సంస్థ నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గురువారం ఢిల్లీలోని డీఆర్డీవో ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన 'సుదర్శన చక్ర' రూపకల్పనలో డీఆర్డీవో కీలక పాత్ర పోషించనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కింద దేశంలోని కీలక సంస్థాపనలకు పూర్తిస్థాయి వైమానిక రక్షణ కల్పించే బాధ్యతను డీఆర్డీవోకు అప్పగించినట్లు తెలిపారు. ఆధునిక యుద్ధంలో ఎయిర్ డిఫెన్స్ ప్రాముఖ్యతను ఆపరేషన్ సిందూర్ సమయంలో చూశామని, ఈ లక్ష్యాన్ని డీఆర్డీవో త్వరగా సాధిస్తుందని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, సాయుధ బలగాలకు అత్యాధునిక సాంకేతికతను అందించడంలో డీఆర్డీవో చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. డీఆర్డీవో శాస్త్రవేత్తల అచంచలమైన నిబద్ధత, శాస్త్రీయ నైపుణ్యం దేశ రక్షణ సన్నద్ధతకు మూలస్తంభాలని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం, విద్యాసంస్థలు, స్టార్టప్‌లతో కలిసి పనిచేయడం ద్వారా దేశంలో ఒక బలమైన రక్షణ పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతోందని అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆవిష్కరణలపై దృష్టి సారిస్తూ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత పెంచే మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. నిరంతరం నేర్చుకుంటూ, భవిష్యత్ టెక్నాలజీలకు అనుగుణంగా సన్నద్ధంగా ఉండాలని డీఆర్డీవో శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు.

## 2025లో పెరిగిన తిరుమల శ్రీవారి లడ్డూల అమ్మకం

తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాల్లో 2025వ సంవత్సరం సరికొత్త రికార్డును నెలకొల్పింది. 2025లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మొత్తం 13.52 కోట్ల లడ్డూలను భక్తులకు విక్రయించింది. 2024లో విక్రయించిన 12.15 కోట్ల లడ్డూలతో పోలిస్తే ఇది సుమారు 1.37 కోట్లు అధికం కావడం విశేషం. 2025లో లడ్డూల అమ్మకాల్లో దాదాపు పది శాతం వృద్ధి నమోదైంది. అంతేకాకుండా, డిసెంబర్ 27వ తేదీన ఒక్కరోజే ఏకంగా 5.13 లక్షల లడ్డూలు విక్రయించి టీటీడీ మరో రికార్డు సృష్టించింది. ఏడాది పొడవునా భక్తుల రద్దీ గణనీయంగా పెరగడం, ముఖ్యంగా వైకుంఠ ద్వార దర్శనం వంటి ప్రత్యేక పర్వదినాలు, బ్రహ్మోత్సవాలు, సెలవు రోజుల్లో భక్తులు భారీగా తరలిరావడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల్లో ఉన్న అచంచల విశ్వాసం, పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా టీటీడీ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 3.5 లక్షల నుంచి 4 లక్షలకు పెంచడం వంటి చర్యలు కూడా అమ్మకాలు పెరగడానికి దోహదపడ్డాయి. గతేడాది జులై నెలలో ఏకంగా రూ.62.2 కోట్ల విలువైన లడ్డూలు అమ్ముడవడం కూడా ఈ ఏడాది రికార్డులో కీలక పాత్ర పోషించింది.

## మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే వీళ్లిద్దరినీ రాళ్లతో కొట్టి చంపుతారు

హైదరాబాద్: తెలంగాణ నీటి హక్కుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు జల వివాదాలను మళ్లీ తెరపైకి తెచ్చి, రెండు రాష్ట్రాల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. గురువారం ప్రజాభవన్‌లో ప్రభుత్వం నిర్వహించిన 'నీళ్లు నిజాలు' కార్యక్రమంలో భాగంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

*** కేసీఆర్ ఒక్క సంతకం.. తెలంగాణకు శాపం**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ప్రధాన పునాది అయిన 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదాన్ని కేసీఆర్ తన పదేళ్ల పాలనలో పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ముఖ్యంగా కృష్ణా జలాల పంపిణీ విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం తెలంగాణకు 'మరణశాసనం' రాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో, కేవలం 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు చాలంటూ కేసీఆర్ సంతకం చేశారు. దీనివల్ల ఏపీకి 512 టీఎంసీలు దక్కాయి. ఇది తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీయడమే. వాస్తవానికి నదీ పరివాహక ప్రాంతం ప్రకారం తెలంగాణకు 71 శాతం వాటా దక్కాలి. కానీ కేసీఆర్ కేవలం 34 శాతానికి అంగీకరించి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు" అని రేవంత్ రెడ్డి గణాంకాలతో వివరించారు. "ఆనాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు పెట్టిన సంతకాలే తెలంగాణ పాలిట మరణ శాసనంగా మారాయి" అని రేవంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. జూరాల ప్రాజెక్టు విషయంలో వీళ్లిద్దరినీ ఉరి తీసినా తప్పులేదు... ఇలాంటి వాళ్లను మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే రాళ్లతో కొట్టి చంపుతారని వ్యాఖ్యానించారు.

**రాజకీయ మనుగడ కోసమే కొత్త డ్రామా**

వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం పాలవడంతో ఆ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పార్టీపై పట్టు నిలుపుకోవడం కోసం, ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే కేసీఆర్ ఇప్పుడు ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి నీళ్ల పంచాయితీ మొదలుపెట్టారని ఆరోపించారు. ఇందుకోసం ఓ అబద్ధాల ప్రచార బృందాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

*** గత ప్రభుత్వ వైఫల్యాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్**

ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 'కృష్ణా, గోదావరి జలాల కేటాయింపులు వినియోగం' అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఆయన కీలక వివరాలు వెల్లడించారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 27,000 కోట్లు ఖర్చు చేసింది. కానీ ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయింది. కనీస చట్టబద్ధమైన అనుమతులు కూడా లేకుండా పనులు ప్రారంభించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గత పదేళ్లలో నీటిపారుదల రంగంపై బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 1.83 లక్షల కోట్లు ఖర్చు చేసినా, ఆశించిన స్థాయిలో కొత్త ఆయకట్టును సృష్టించలేకపోయిందని, పైగా ప్రాజెక్టుల కోసం రూ. 96,000 కోట్ల అప్పులు చేసి రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని ఆయన ఆరోపించారు. జనవరి 2న అసెంబ్లీ సమావేశాలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, నీటిపారుదల రంగంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. "కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిద్దాం. దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి" అని సవాల్ విసిరారు. తెలంగాణ హక్కుల కోసం ట్రిబ్యునళ్ల వద్ద, చట్టపరంగా తమ ప్రభుత్వం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## కుట్రదారుల ముసుగులు తొలగిపోయాయి

బంగ్లాదేశ్, జనవరి 01 : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా.. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నూతన సంవత్సర సందేశంలో భాగంగా గురువారం ఆమె స్పందిస్తూ... తీవ్ర అవినీతి, అసత్యాలు, స్వప్రయోజనాలతో ప్రస్తుత పాలకులు దేశాన్ని చీకటిలోకి నెట్టివేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అవామీ లీగ్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో షేక్ హసీనా సందేశాన్ని పంచుకుంది. "దేశాన్ని నాశనం చేయడానికి కుట్రలు పన్నుతున్న వారి ముసుగులు, దుర్మార్గపు ముఖాలు ఇప్పటికే ప్రజల ముందు బట్టబయలయ్యాయి. చట్టవిరుద్ధంగా అధికారాన్ని చేజిక్కించుకున్న వారు, మిమ్మల్ని బందీలుగా పట్టుకుని అంతులేని అవినీతి, అబద్ధాలతో దేశాన్ని ఎలా చీకట్లోకి నెట్టారో మీరంతా చూశారు" అని హసీనా పేర్కొన్నారు. ప్రస్తుత పాలకుల వల్ల ప్రపంచవ్యాప్తంగా బంగ్లాదేశ్ అంటే ఒక భయంగా మారిందని, అందుకే ఏ దేశం కూడా బంగ్లాదేశ్‌ను, దాని ప్రజలను గౌరవంగా చూడటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులు, దాతృత్వ సంస్థలు ఎదుర్కొంటున్న అభద్రత, దేశంలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల కారణంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని వివరించారు. "మతం, వర్ణం, వర్గం, వృత్తి, జాతి అనే తేడా లేకుండా ఈ దేశం నిజంగా ప్రజలందరిదీ కావాలన్నదే నా కల, జీవితకాల పోరాట ఆకాంక్ష. కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సామరస్యం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలి" అని హసీనా ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ప్రపంచ వేదికపై దేశానికి గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించడానికి అవిశ్రాంతంగా పనిచేసిందని, కానీ ఇప్పుడు బంగ్లాదేశ్ ప్రత్యేక గుర్తింపు, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా 1971 విమోచన యుద్ధ వారసత్వం ప్రశ్నార్థకంగా మారాయని ఆమె ఆవేదన చెందారు. "ఈ చీకటి ప్రయాణం నుంచి దేశాన్ని కాపాడేందుకు మనమందరం ఏకం కావాలి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతిజ్ఞ చేద్దాం. ప్రజలు ఈ కష్టాలను ఎక్కువ కాలం కొనసాగనివ్వరని నేను గట్టిగా నమ్ముతున్నాను. కొత్త సంవత్సరంలోనే దీనికి ఒక నిర్ణయాత్మక ఫలితాన్ని చూస్తాం" అని షేక్ హసీనా ధీమా వ్యక్తం చేశారు. గతానుభవాలను గుర్తుచేస్తూ, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రజలు భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఏకతాటిపై నిలిచారని ఆమె అన్నారు.

## 2025లో ఏపీ ప్రస్థానంపై జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం

అమరావతి: 2025 సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించింది. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం... అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రయాణం వంటి కీలక పరిణామాలకు ఈ ఏడాది సాక్ష్యంగా నిలిచింది. ఎన్నికల హామీకి అనుగుణంగా రాజధాని పనులను పట్టాలెక్కించడం ఈ ఏడాదికే తలమానికంగా నిలిచింది. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థ ఐఏఎన్ఎస్ ఓ కథనం వెలువరించింది. దాదాపు పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి పనులను, 2025 మే 2న ఆయన చేతుల మీదుగానే మళ్లీ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కలల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నారు. హైకోర్టు, శాసనసభ, సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల వంటి రూ. 56,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులు తిరిగి మొదలయ్యాయి. 2028 మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేస్తామని సీఎం ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో అమరావతిలో రెండో దశ భూ సమీకరణకు కూడా శ్రీకారం చుట్టారు. అమరావతిని అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో 'క్వాంటమ్ వ్యాలీ'గా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలను ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహంలో విశాఖపట్నంలో గూగుల్ తన అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం ఒక మైలురాయిగా నిలిచింది. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొన్న ప్రకారం, ఈ పరిణామం విశాఖ రూపురేఖలను మార్చేస్తుందని ఐటీ మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. గూగుల్ ఐదేళ్లలో పెట్టనున్న 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుంది. గత 16 నెలల్లో రాష్ట్రం 120 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 10 లక్షల కోట్లు) పెట్టుబడులను ఆకర్షించిందని ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో ఏకంగా రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 610 ఎంఓయూలు కుదిరాయి. రాష్ట్రంలో మూడు ఆర్థిక కారిడార్లను అభివృద్ధి చేస్తూ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విశాఖపట్నం, అమరావతి, రాయలసీమ ప్రాంతాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలన్న 'సూపర్ సిక్స్' హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సంక్షేమ రంగంలోనూ ప్రభుత్వం తనదైన ముద్ర వేసింది. 'తల్లికి వందనం' పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు అందించారు. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే, 'అన్నదాత సుఖీభవ' కింద 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,310 కోట్లు జమ చేశారు. ఎన్టీఆర్ భరోసా కింద 63 లక్షల మందికి ఏటా రూ. 33,000 కోట్ల పింఛన్లు అందిస్తున్నారు. పరిపాలనలో పారదర్శకత కోసం వాట్సాప్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో డేటా ఆధారిత నిర్ణయాలు వంటి ఆధునిక పద్ధతులను ప్రభుత్వం అనుసరిస్తోంది. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే లక్ష్యంతో 'పీ4' (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించడం ఈ ఏడాదిలోని మరో విశేషం. మొత్తం మీద 2025 సంవత్సరం అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలతో ఏపీకి ఒక బలమైన పునాది వేసింది.

## తెలంగాణలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు

తెలంగాణ: నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మద్యం విక్రయాలు భారీగా నమోదయ్యాయి. డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో కలిపి మూడు రోజుల్లోనే సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్ముడైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ మూడు రోజుల్లో 8.30 లక్షల కేసుల లిక్కర్, 7.78 లక్షల కేసుల బీర్ల విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఆరు రోజుల్లో మొత్తం రూ.1,350 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబర్ 30న రికార్డు స్థాయిలో రూ.520 కోట్ల అమ్మకాలు జరగగా, 31న రూ.370 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. తెలంగాణలో డిసెంబర్ మొదటి పదిహేను రోజుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల కారణంగా కూడా మద్యం విక్రయాలు అధికంగా జరిగాయి. డిసెంబర్ నెలలో నూతన సంవత్సర వేడుకలతో పాటు పంచాయతీ ఎన్నికలు కూడా ఉండటంతో 2024 డిసెంబర్‌తో పోలిస్తే మద్యం విక్రయాలు రూ.1,349 కోట్లు అధికంగా జరిగాయి.

## భారత్‌లో చిక్కుకున్న హెచ్-1బీ ఉద్యోగులకు అమెజాన్ బంపరాఫర్

హెచ్ 1బీ వీసా జాప్యం కారణంగా అమెరికాకు వెళ్లలేక భారత్‌లో చిక్కుకుపోయిన తమ ఉద్యోగులకు టెక్ దిగ్గజం అమెజాన్ భారీ ఊరటనిచ్చింది. వీసా అపాయింట్‌మెంట్ల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు 2026 మార్చి 2 వరకు భారత్ నుంచే పని (వర్క్ ఫ్రమ్ హోమ్) చేసుకునే వెసులుబాటు కల్పించింది. సాధారణంగా వారానికి ఐదు రోజులు ఆఫీసు నుంచి పనిచేయాలనే నిబంధనను ఈ ప్రత్యేక పరిస్థితుల్లో సడలించినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ కథనం పేర్కొంది. 2025 డిసెంబర్ 13 నాటికి భారత్‌లో ఉండి, వీసా స్లాట్స్ దొరక్క ఇబ్బంది పడుతున్న వారికి మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుంది. అయితే, ఈ వెసులుబాటుతో పాటు కంపెనీ కొన్ని వింత ఆంక్షలను కూడా విధించింది. ఇండియా నుంచి పనిచేసే ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ కోడింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ వంటి సాంకేతిక పనులు చేయకూడదని స్పష్టం చేసింది. అంతేకాకుండా వారు భారత్‌లోని ఏ అమెజాన్ కార్యాలయానికి వెళ్లకూడదని, టీమ్ మేనేజ్‌మెంట్




లేదా ఒప్పందాలపై సంతకాలు చేయడం వంటి అధికారిక నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చిచెప్పింది. కేవలం పరిమితమైన విధులను మాత్రమే నిర్వర్తించాల్సి ఉంటుంది. చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకే ఈ నిబంధనలు విధించినట్లు తెలుస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. అమెజాన్ తీసుకున్న ఈ నిర్ణయం వేలాది మంది టెక్కీలకు తాత్కాలికంగా ఊరటనిచ్చింది. మరోవైపు గూగుల్, యాపిల్ వంటి సంస్థలు కూడా వీసా సమస్యల దృష్ట్యా అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని తమ ఉద్యోగులకు సూచించాయి.

## హైదరాబాద్‌లో ప్రశాంతంగా 2026 వేడుకలు

హైదరాబాద్: భాగ్యనగరం 2026 నూతన సంవత్సరానికి ప్రశాంతంగా, సురక్షితంగా స్వాగతం పలికింది. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా నగరంలో ఎలాంటి పెద్ద ప్రమాదాలు గానీ, డ్రంకెన్ డ్రైవ్ ఘటనలు గానీ నమోదు కాకపోవడం విశేషం. పోలీసుల పటిష్ఠమైన చర్యలు, ప్రజల్లో పెరిగిన అవగాహన, వారి సహకారంతోనే ఇది సాధ్యమైందని నగర అధికారులు ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ పోలీసులు డిసెంబర్ 24, 2025 నుంచే ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా న్యూ ఇయర్ ఈవ్ రోజున నగరం మొత్తంలో 100కు పైగా ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానం అవలంబించారు. పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు చేపట్టారు. సైబరాబాద్ వంటి ప్రాంతాల్లో రద్దీని తగ్గించి, సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించేందుకు ఉచిత షటిల్ సర్వీసులను కూడా నడిపారు. నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని పబ్‌లు, హోటళ్లు, క్యాబ్, ఆటో డ్రైవర్లకు ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఏర్పాట్లు అద్భుతమైన ఫలితాలనిచ్చాయని జనవరి 1న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. "పోలీసుల కఠిన నిఘా, సమర్థవంతమైన అవగాహన కార్యక్రమాలు, ప్రజల మద్దతు వల్లే ఒక్క దుర్ఘటన కూడా జరగలేదు," అని ఆయన అన్నారు. ఇది అందరి సహకారం వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

# గరిమెళ్ళపాడు ఉద్యానవన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గరిమెళ్ళపాడు ఉద్యానవన నర్సరీ , శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం సందర్శించారు. సుమారు 72 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ నర్సరీని పూర్తిగా కలియతిరిగి పరిశీలించారు. గతంలో నిర్మించిన పాత భవనాలను ఒక్కొక్కటిగా నిశితంగా పరిశీలిస్తూ ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు.నర్సరీలో ప్రస్తుతం ఉన్న మొక్కలు, గతంలో ఉన్న మొక్కల వివరాలు, వివిధ విభాగాల పనితీరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే హార్టికల్చర్ సిబ్బంది రాజారామ్ నుండి నర్సరీ నిర్వహణపై పూర్తి వివరాలు సేకరించారు. గతంలో నర్సరీ ఎలా ఉండేదో, ప్రస్తుతం ఏ పరిస్థితిలో ఉందో సమీక్షించిన కలెక్టర్, మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అవసరమైన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఒకప్పుడు ఉన్న స్థాయికి నర్సరీని తీసుకువచ్చేలా సంబంధిత అధికారులతో చర్చించి సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:2026 నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి నూతన సంవత్సర క్యాలెండర్, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి, తిరుమలలో మొక్కల ఆవశ్యకతపై నైనిక రజువా చేసిన ప్రచార దృశ్యాలను చూసిన కలెక్టర్ అభినందనలు తెలిపారు. ప్రకృతి పరిరక్షణపై చూపుతున్న ఆసక్తిని ప్రశంసిస్తూ కలెక్టర్ ''వెరీ గుడ్'' అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నైనిక తల్లిదండ్రులు దశరథ్ రజువా, ఝాన్సీ రాణితోపాటు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫాస్టర్ డా. సుబ్బలక్ష్మి కి ఘనసన్మానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సర్వజ్ఞాని ప్రార్థన మందిరం నిర్వాహకురాలు ఫాస్టర్ డా. కె. సుబ్బలక్ష్మి ని ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. నూతన సంవత్సరం వేడుకలలో బాగంగా, గొల్లగూడెంలోని సర్వజ్ఞాని ప్రార్ధనా మందిరంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు సుగుణారావు మాట్లాడుతూ. క్యాన్సర్, ఇతరవ్యాధులకు కారణమయ్యే ప్లాస్టిక్ ను వాడకూడదాని, సంస్థ వ్యవస్థాపకులు, ప్రకృతి కవి జయరాజు ఇచ్చిన పిలుపునందుకుని, చర్చ్ లో నెలకు రెండు సార్లు అన్నదానం స్టీల్ ప్లేట్స్, గ్లాసులలోనే చేస్తూ, సభ్యులకు ప్రకృతిపై అవగాహనను కల్పిస్తున్న సుబ్బలక్ష్మి ని ఆశ్రమం తరపున ఎంపిక చేశామన్నారు. ఆమె గత 10 నెలలుగా ఆచరిస్తూ, ప్లాస్టిక్ పై ప్రజలకు అవగాహనను కల్పిసున్నారని తెలిపారు. ఆమె మాట విని అందరూ స్టీల్ పాత్రలనే వాడుతున్నారన్నారు.ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి, ఆశ్రమ మెమంటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, బి.శివకుమార్, నాగేశ్వరరావు,అనిల్, సత్తిబాబు, విశ్వేశ్వరీ, శ్రీనివాస్, సౌందర్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరం సందర్భంగా గురువారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు ముదిరాజ్ లు ఆయనను మార్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# బొగ్గు టిప్పర్ ఢీకొని వృద్ధ మహిళ మృతి

*** పరారీలో టిప్పర్ డ్రైవర్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : బొగ్గు టిప్పర్ ఢీకొని వృద్ధ మహిళ మృతి చెందిన విషాద సంఘటన కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..... రామవరం ప్రశాంతి నగర్ చెందిన కొమ్ముల సరోజ (65), ఆమె నూతన సంవత్సర సందర్భంగా గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చర్చికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా రామవరం పరిధిలో రోడ్డు దాటుతున్న సమయంలో, రుద్రంపూర్ నుంచి టేకులపల్లి వైపు వెళ్తున్న బొగ్గు టిప్పర్ డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మరో టిప్పర్‌ను ఓవర్టేక్ చేయబోయి మహిళను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.



ప్రమాదంలో తీవ్ర గాయాలైన సరోజను టూ టౌన్ పోలీసులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ డి. ప్రతాప్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే ఒక నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం అనంతరం డ్రైవర్‌ను స్థానికులు పట్టుకున్నప్పటికీ, వారి నుంచి తప్పించుకుని పరారైనట్లు సమాచారం.



# మానవ సంబంధాలు మన బాధ్యత కాదు.. అవి దేవుని బాధ్యత

*** ప్రముఖ రేఖి గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్**

కూకట్ పల్లి: (ప్రజాస్ఫూర్తి) : మానవ సంబంధాలు మన బాధ్యత కాదు - అవి దేవుని బాధ్యత" అన్న ఆలోచన పుస్తకానికి మూల భావమని ప్రముఖ రేఖి గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ స్పష్టంగా వివరించారు. సంబంధాలు జీవిత సారాంశం" పుస్తకావిష్కరణ మహోత్సవం గురువారం కూకట్ పల్లి లోని రాందేవ్ రావు హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రేఖి గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్, రాందేవ్ రావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జీవితంలోని ప్రతి సంబంధం తల్లి అనే మొదటి బంధం నుంచి ప్రారంభమై, కుటుంబం, సమాజం, విలువలు, చివరికి దేవుడితో ఉన్న సంబంధం వరకు విస్తరిస్తుందని ఈ పుస్తకం తెలియజేస్తుందన్నారు. జీవితం అనేది కేవలం సంఘటనల పరంపర కాదని, అది సంబంధాల ప్రయాణమన్నారు. నేటి తరం మానవసంబంధాల మేల్కొలుపు" అనే ప్రధాన అంశంతో, ఆధునిక జీవనశైలి వల్ల సంబంధాల్లో ఏర్పడుతున్న అహంకారం, అపార్థాలు, తప్పుడు నిర్ణయాలు, సంభాషణ లోపం వంటి సమస్యలను ఈ పుస్తకం సున్నితంగా విశ్లేషిస్తుంది. సంబంధాలను ఎలా విలువైనవిగా మలచుకోవాలి, ఎలా కాపాడుకోవాలి, ఎలా ముందుకు సాగాలి అనే విషయాలకు మార్గదర్శకత్వం అందిస్తుందన్నారు. ఈ పుస్తకం సరళమైన, హృదయానికి చేరువైన భాషలో అన్ని వయస్సుల పాఠకులను దృష్టిలో ఉంచుకుని రచించబడిందని తెలిపారు. సంబంధాలు నియంత్రణతో కాదు, నమ్మకం, ఓపిక, సహనం, పరస్పర గౌరవం, మనసు విస్తృతితోనే నిలబడతాయని ఆమె వివరించారు. తెలిపారు.ఈ పుస్తకంలోని ప్రత్యేకత ఏమిటంటే, రచయిత బంధువులు, స్నేహితులు, వైద్యులు, విద్యావేత్తలు, శ్రేయోభిలాషులు పంచుకున్న అభిప్రాయాలు, కవితలు, ఆలోచనలు ఇందులో చోటు దక్కాయన్నారు. . సంబంధాలను కొందరు జీవితానికి దారి చూపే వీధి దీపాలుగా, మరికొందరు ఆత్మకు రెక్కలు ఇచ్చే బంధాలుగా, ఇంకొందరు దేవుడిచ్చిన వరాలుగా వర్ణించారు.పుస్తకావిష్కరణ సందర్భంగా పలువురు రచనలు అందించినవారు మాట్లాడుతూ, ఈ పుస్తకం చాలా బాగుంది, సరళంగా ఉంది, హృదయాన్ని తాకుతుంది అని ప్రశంసించారు. తమ ఆలోచనలు ఈ పుస్తకంలో భాగమవ్వడం పట్ల గర్వంగా, గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఇది ఒక వ్యక్తి రచన మాత్రమే కాకుండా సామూహిక అనుభవాల ప్రతిబింబమని పేర్కొన్నారు. రేఖి గ్రాండ్ మాస్టర్, కౌన్సిలర్, విద్యావేత్త అయిన లక్ష్మి కమలాకర్, తన జీవిత అనుభవాలు, ఆధ్యాత్మిక దృష్టి, సామాజిక సేవల సారాన్ని ఈ పుస్తకంలో మేళవించారు. ఈ పుస్తకం నేటి భావోద్వేగపూరిత సమాజానికి అవసరమైన ఆత్మపరిశీలన గ్రంథంగా నిలుస్తుందని హాస్పిటల్ యాజమాన్యం ప్రశంసించింది ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్లు, సీనియర్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలో విషాదం

*** పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సర వేడుకలు విషాదంగా మారిన ఘటన గాజులరామారం సర్కిల్ పరిధిలోని భవాని నగర్‌లో చోటుచేసుకుంది. డిసెంబర్ 31న నూతన సంవత్సర స్వాగతం పలుకుతూ నిర్వహించిన పార్టీకి హాజరైన ఓ వ్యక్తి విందు అనంతరం మృతి చెందాడు. భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో సుమారు 30 మంది స్థానికులు కలిసి ఏర్పాటు చేసుకున్న విందులో మద్యం, నాన్‌వెజ్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలను సేవించారు. పార్టీ ముగించుకుని ఇంటికి వెళ్లిన అనంతరం ఒక పాండు ( 54)వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో విందులో పాల్గొన్న మరికొంతమందికి కూడా వాంతులు, తలతిరగడం, అస్వస్థత లక్షణాలు కనిపించడంతో వారిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులు, సూరారం నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాస్పిటల్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడారు. అలాగే బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులకు ధైర్యం చెబుతూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.ఇదే సందర్భంలో బీజేపీ నాయకులు, గాజులరామారం కార్పొరేటర్ రావు శేషగిరి, గిరి వర్ధన్ రెడ్డి, ఎం.ఎస్. వాసు, రావుల పృథ్వీ, నవాబ్, భరత్ కుమార్, మురళీకృష్ణ, మహేందర్ రెడ్డి, శంకర్ నాయుడు, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, సాయినాథ్ నేత తదితరులు హాస్పిటల్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై ఫుడ్ పాయిజన్‌కు కారణమైన ఆహార పదార్థాలపై విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత – రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఐడీఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కట్టుబాటుగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదనే అంశంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో రోడ్డు



భద్రతా సందేశాలతో కూడిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ సమర్థవంతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా ఆర్టీఏ అధికారి జోషి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు మనోహర్, వెంకట పుల్లయ్య, తదితరులు, రవాణా శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావు కు శుభాకాంక్షలు తెలిపిన బిక్షపతి



అందోలు, ప్రజాస్ఫూర్తి : మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును గురువారం ఆయన నివాసంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి కలిశారు. హరీష్ రావుకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజం శాంతి, ఆనందంతో ఉండాలని ఆకాంక్షించారు.2026 ఏడాది అందరికీ అద్భుతమైన సంవత్సరం కావాలని కోరుకుంటున్నానన్నారు. ఈ ఏడాది ప్రజలు చేసే అన్ని ప్రయత్నాలు విజయవంతం కావాలని.. మంచి ఆరోగ్యం, శ్రేయస్సు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నానని, సమాజం శాంతి, ఆనందంతో ఉండాలని కోరుకుంటున్నా అని తెలిపారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి బీసీ సంక్షేమ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని వారి నివాసంలో అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ జన్మదిన వేడుకలు





జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : బిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ జన్మదిన వేడుకలు గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్ధూంనగర్ నగర్ లోని ఆయన కార్యాలయం అవరణంలో కుటుంబ సభ్యులు,మిత్రులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పలువురు నాయకుల, అభిమానులు ఆయనను శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు మాజీ మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్,ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు,స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడు కార్పొరేటర్ కొలుకుల జగన్,కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ,మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, పలువురు జర్నలిస్టు మిత్రులు శ్రీనివాస్, ఏ.రాజేంద్ర కుమార్, శ్రీరామరాజు, నరేందర్ రాజు, సాయిబాబా,కోటగడ్డ శ్రీనివాస్, వర్కాల నాగరాజు, వెంకటేష్, శ్రీధర్, స్థానిక బి ఆర్ఎస్ నాయకులు రాయి విఘ్నేష్, మైలారం రాజు,పి.సత్తిరెడ్డి తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

# హెచ్ఎంటి ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరీ ఆవిష్కరణ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : 2026 నూతన సంవత్సరం సందర్భంగా హెచ్ఎంటి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన డైరీని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గురువారం పెట్ బషీరాబాద్ లో గల ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ ఎండి. అంజర్ షాహిన్, ఉపాధ్యక్షులు టీ.వి. సత్యనారాయణ, కార్యదర్శి పండరి, కోశాధికారి వికాస్ కుమార్, డైరెక్టర్లు తులసీదాస్, కళావతి, దివ్య జ్యోతి, శ్రీశైలం, అనంత రాములు, అలాగే సభ్యులు జి. వెంకన్న, ఆర్. మురళీ గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ దూర దృష్టితో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి

**: బీజేపీ చీఫ్‌రాంచందర్ రావు**



ప్రధాని మోడీ 2025 సంవత్సరంలో దృఢమైన, దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో, వారి అడుగుజాడల్లో నడుస్తూ 2026లో భారతదేశాన్ని "వికసిత్ భారత్"గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం భారతదేశ, తెలంగాణ ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత్ ప్రస్తుతం 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకునే దిశగా దేశం వేగంగా ముందుకెళ్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన సంవత్సరంలో మనందరం "నేషన్ ఫస్ట్" అనే భావనతో దేశానికి మన జీవితాన్ని అంకితం చేస్తూ, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి చూపిన మార్గంలో నడుచుకుంటూ, మోడీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యం సాధన దిశగా ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.

# ప్రజాప్రభుత్వంలో జర్నలిస్టులకు న్యాయం చేస్తాం..

*** సియం ఎ.రేవంత్ రెడ్డి**



(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను తన దృష్టికి తెస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం సచివాలయంలో సియంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. అలాగే యూనియన్ రూపొందించిన 2026 మీడియా డైరీని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేసింది. ఈ సందర్భంలో జర్నలిస్టులకు నూతన సంవత్సర కానుకగా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ ముఖ్యమంత్రిని కోరగా, ఆయన పై విధంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, కార్యదర్శులు వి.యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, అజిత, చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియుద్దీన్, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరీష్‌లు ఉన్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని యూనియన్ ప్రతినిధి బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది.





*** సీయంకు శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్ రెడ్డి**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి గురువారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన సంవత్సర వేడుకలు విషాదం

*** పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సర వేడుకలు విషాదంగా మారిన ఘటన గాజులరామారం సర్కిల్ పరిధిలోని భవాని నగర్‌లో చోటుచేసుకుంది. డిసెంబర్ 31న నూతన సంవత్సర స్వాగతం పలుకుతూ నిర్వహించిన పార్టీకి హాజరైన ఓ వ్యక్తి విందు అనంతరం మృతి చెందాడు. భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో సుమారు 30 మంది స్థానికులు కలిసి ఏర్పాటు చేసుకున్న విందులో మద్యం, నాన్‌వెజ్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలను సేవించారు. పార్టీ ముగించుకుని ఇంటికి వెళ్లిన అనంతరం ఒక పాండు ( 54)వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో విందులో పాల్గొన్న మరికొంతమందికి కూడా వాంతులు, తలతిరగడం, అస్వస్థత లక్షణాలు కనిపించడంతో వారిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులు, సూరారం నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాస్పిటల్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడారు. అలాగే బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులకు ధైర్యం చెబుతూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.ఇదే సందర్భంలో బీజేపీ నాయకులు, గాజులరామారం కార్పొరేటర్ రావు శేషగిరి, గిరి వర్ధన్ రెడ్డి, ఎం.ఎస్. వాసు, రావుల పృథ్వీ, నవాబ్, భరత్ కుమార్, మురళీకృష్ణ, మహేందర్ రెడ్డి, శంకర్ నాయుడు, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, సాయినాథ్ నేత తదితరులు హాస్పిటల్‌కు వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై ఫుడ్ పాయిజన్‌కు కారణమైన ఆహార పదార్థాలపై విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ఇబ్బంది లేకుండా అందించాలి..

*** టీజీఎస్పీడీసీఎల్ సిఎండికి డిప్యూటీ సీఎం ఆదేశం**



రాష్ట్రంలో కొత్త ఏడాది విద్యుత్ కోతలు అనే మాటే లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా దానికి అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఆధ్వర్యంలో అధికారులు డిప్యూటి సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపాదించిన అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వి. శివాజీ, డా. ఎన్ నర్సింహులు, సీహెచ్. చక్రపాణి, పి. కృష్ణా రెడ్డి ఉన్నారు.

## దారుణం.. ముగ్గురు పిల్లలకు

# విషమిచ్చి చంపి తండ్రి ఆత్మహత్య

ఉయ్యాలవాడ: నంద్యాల జిల్లాలో ఉయ్యాలవాడ మండలంలో దారుణం చోటుచేసుకుంది. ఓ తండ్రి తన ముగ్గురు పిల్లలకు విషం కలిపిన కూల్ డ్రింక్ తాగించి చంపి ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుడుములదిన్నె గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్ర (35) తన ముగ్గురు పిల్లలు కావ్యశ్రీ (7), జ్ఞానేశ్వరి (4), సూర్యగగన్ (2)లకు విషం కలిపిన కూల్‌డ్రింక్‌ను తాగించాడు. అనంతరం తాను కూడా ఉరివేసుకున్నాడు. ఆగస్టు 16న సురేంద్ర భార్య మహేశ్వరి (32) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్న సురేంద్ర.. తన ముగ్గురు పిల్లలను చంపి తాను కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



# నా జీవితంలో నిలిచిపోయే మధుర క్షణాలు ఇవే

తెలుగు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారా లోకేశ్ గత ఏడాదిలో తనను సంతృప్తి పరిచిన అంశాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అవి తాను సాధించిన విజయాలుగా, తన జీవితంలో నిలిచిపోయే మధుర క్షణాలుగా చెప్పుకొచ్చారు. రాష్ట్ర విద్యాశాఖలో తీసుకొచ్చిన మార్పులపై ప్రధాని మోడీ ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేసుకుని లోకేశ్ సంతోషపడ్డారు. స్కూలు పిల్లలు మోస్తున్న పుస్తకాల భారంపై తాను తీసుకున్న 'నో బ్యాగ్ డే' నిర్ణయం విప్లవాత్మక విజయాన్ని సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి శనివారం స్కూలు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే నిరుద్యోగుల కోసం తీసుకున్న మరో విప్లవాత్మకమైన నిర్ణయం 'మెగా డీఎస్సీ' అని గుర్తు చేశారు. నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగుల ఆశలను నెరవేర్చడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు.




**ఇవీ కీలకమే..**

మరో అంశం యోగా డే అని, ఫిట్‌నెస్‌పై యువతకు అవగాహన కల్పించడం, తనకు సైతం నూతనోత్సాహాన్నిచ్చిందని తెలిపారు. 2025లో అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకున్నామని చెప్పారు. 'మన మిత్ర' పేరుతో సామాన్యుడికి వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఫిర్యాదులు, సలహాలు ప్రజలకు చేరువ చేశామని గుర్తు చేశారు. ఏపీని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చేందుకు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో భేటీ కావడం, ఏపీలో పెట్టుబడులకు సహకారం కోరడం కూడా తాను మర్చిపోలేని మధుర క్షణాలు అని ప్రజలతో మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

# న్యూ ఇయర్ వేళ చరిత్ర తిరగ రాసిన విశాఖ



విశాఖపట్నం చరిత్రను తిరగరాసింది. ఫుల్ కిక్కుతో ఉక్కు సిటీ ఉర్రూతలూగిపోయింది. ఒక్క రోజులోనే అంతా మారిపోయింది. ఎప్పుడూ రానంత కిక్కు ఈ న్యూఇయర్‌కు వచ్చింది. దెబ్బతో కాసుల గలగలే.. **గ్రాండ్‌గా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్** ఎంతో కూల్‌గా ఉండే విశాఖ నగర వాసులు ఈ న్యూ ఇయర్ ను ఫుల్ ఎంజాయ్ చేశారు. డిసెంబర్ 31ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. విందు, మందుతో చిందేశారు. దెబ్బతో సిటీ ఖజానా ఫుల్‌గా నిండిపోయింది. ఒక్క రోజులోనే భారీ ఆదాయం వచ్చింది. మద్యం అమ్మకాలపై బుధవారం దాదాపు రూ.10 కోట్లు వచ్చినట్లు తెలిపారు. గురువారం కూడా కాసుల కల్లోలమేనని అంచనా వేశారు. విశాఖ చరిత్రలో ఇదో మైలురాయి అని అధికారులు చెబుతున్నారు. మద్యంపై ఎన్నడూ లేనంతగా ఆదాయం వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదాయం లేని రాష్ట్రంలో న్యూ ఇయర్ ఇచ్చిన కిక్ అటు ప్రభుత్వ పెద్దలకు సైతం సంతోషాన్ని కలిగిస్తోంది.

# ఏపీకి కేంద్ర ప్రభుత్వం శుభవార్త.. ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

న్యూ ఇయర్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రభుత్వం తీపికబురు అందించింది. కనీస వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 2020 జాతీయ విద్యా విధానం ద్వారా సకల సౌకర్యాలు కల్పించడంతో పాటుగా నాణ్యమైన విద్యను సైతం అందించేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఏపీ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కి తెలియజేసింది. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద రాష్ట్రంలోని 935 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసినట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా స్కూళ్ల భవనాలు, మౌలిక వసతులు, డిజిటల్ సౌకర్యాలు, అత్యాధునిక ల్యాబ్స్‌తో పాటు స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది.



# తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌ను అభినందించిన సీఎం

ఉన్నత విద్యలో చేపడుతున్న సంస్కరణలపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యలో సంస్కరణల ఒరవడి ఇదే స్థాయిలో కొనసాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలకు ఉన్నత విద్యా మండలి కేంద్ర బిందువుగా నిలుస్తోందని మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బాలకిష్టారెడ్డి గురువారం కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆయన సేవలను ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి దిశగా అన్ని స్థాయిల సమన్వయంతో ఛైర్మన్ చేస్తున్న కృషిని సీఎం ప్రశంసించారు. తెలంగాణ ఉన్నత విద్య జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి వివిధ సందర్భాల్లో ఆకాంక్షించారు. సీఎం మనోభావాలకు అనుగుణంగా బాలకిష్టారెడ్డి గత ఏడాదిగా అనేక అంశాలపై కసరత్తు చేశారు. సిలబస్ మార్పు, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు అవసరమైన ఏర్పాట్లపై విస్తృత చర్చలు జరిపారు. ఈ దిశగా సాగుతున్న



పురోగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కృషి ఇలాగే కొనసాగాలని, ఇతర దేశాల్లో వస్తున్న విద్యా పరమైన మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్ళాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలను శక్తివంచన లేకుండా నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి బాలకిష్టారెడ్డి భరోసా కల్పించారు.



## తెలంగాణ పోలీసుల అదుపులో మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా?

హైదరాబాద్: తెలంగాణ పోలీసుల అదుపులో మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా అలియాస్ సుక్కాతో పాటు 15 మంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం. సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన దేవా.. హిడ్మాతో కలిసి పనిచేసినట్టు చెబుతున్నారు. బర్సె దేవాపై రూ.50లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మరో వైపు మావోయిస్టులను కోర్టులో హాజరు పర్చాలని పౌరహక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మావోయిస్టుల అరెస్ట్‌పై పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

## కేసీఆర్‌ను విమర్శిస్తే సూర్యుడి మీద ఉమ్మేసినట్లే

**: హరీశ్ రావు**

హైదరాబాద్: అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి అని భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. టీఎంసీల కొద్దీ అబద్ధాలు, క్యూసెక్కుల కొద్దీ అజ్ఞానాన్ని పారించారని ఆరోపించారు. సీఎంకే బేసిన్లపై బేసిక్ నాలెడ్జ్ లేదన్నది బహిరంగ సత్యమని వ్యాఖ్యానించారు. నీటి ప్రాజెక్టులపై చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం చేసిన విమర్శలపై హరీశ్ రావు స్పందించారు. ‘‘కేసీఆర్‌ను, నన్ను ఉరి తీయాలంటూ సీఎం అనాగరిక వ్యాఖ్యలు చేశారు. నల్లమలసాగర్‌పై



నా ప్రశ్నకు సూటిగా సమాధానం ఎందుకు చెప్పలేదు? బనకచర్ల మీద సుప్రీంలో పోరాటం నిజమైతే కమిటీ ఎందుకు వేశారు? కమిటీ వేయడం అంటేనే ఏపీ జలదోపిడీకి తలుపులు తెరవడం. 812 టీఎంసీల్లో తెలంగాణకు 69 శాతం దక్కాలని అప్పుడే డిమాండ్ చేశాం. బ్రిజేష్ ట్రైబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకు 50:50 నిష్పత్తి కావాలని అడిగాం. కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్రం హామీ ఇస్తేనే కేసు విత్ డ్రా చేసుకున్నాం. కేసీఆర్‌ను విమర్శిస్తే సూర్యుడి మీద ఉమ్మేసినట్లే. తుంగభద్ర ద్వారా శ్రీశైలానికి 450 600 టీఎంసీలు వస్తాయనే జ్ఞానం సీఎంకు లేదు. జూరాల ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాల్లో క్రాప్ హాలీడే ఎందుకు ప్రకటించారు? శ్రీశైలం మీద ఆధారపడిన కల్వకుర్తికి లోటు లేకుండా నీరు వస్తోంది. జూరాల మీద భారం పెడితే ఎవరికీ నీళ్లు రాక ఆగమైపోతారు. పాలమూరుకు 90 టీఎంసీలతో డీపీఆర్ పంపి 7 అనుమతులు తెచ్చాం. కాంగ్రెస్ ఈ రెండేళ్లలో ఒక్క అనుమతి తెచ్చింది లేదు’’ అని హరీశ్ రావు విమర్శించారు.

## రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు: ఉత్తమ్

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.80 వేల కోట్లు అవసరమని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చెప్పిందన్నారు. నీటి వాటాలపై అసెంబ్లీలో శుక్రవారం చర్చ జరగనున్న దృష్ట్యా ‘నీళ్లునిజాలు’ అంశంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్,



పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఏపీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, ఇతరపథకాలపై ఉత్తమ్ వివరణ ఇచ్చారు. ‘‘పాలమూరు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.80 వేల కోట్లకుపైగా కావాలి. రూ.80వేల కోట్ల ప్రాజెక్టుపై రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పూర్తయినట్లా? మేం వచ్చాక రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి తీయలేదని ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోంది’’ అని ఉత్తమ్ మండిపడ్డారు.

## యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

### ఈవో రాజీనామా.. ప్రభుత్వం ఆమోదం

హైదరాబాద్: తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఈవో రాజీనామా చేశారు. వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలతో రాజీనామా చేసినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. ఆయన రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దేవాదాయ శాఖ కమిషనర్‌గా సేవలు అందించిన ఆయన్ను రిటైర్‌మెంట్ తర్వాత యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా ప్రభుత్వం నియమించింది. అయితే, ఇప్పుడు వ్యక్తిగత కారణాలతో ఈవో బాధ్యతల నుంచి వైదొలిగారు.



## తెలంగాణలో మరో అగ్ర మావోయిస్టు లొంగుబాటు.. కొనసాగుతున్న సస్పెన్స్

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా నాలుగు రాష్ట్రాల్లో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. మావోయిస్టులు లొంగిపోవాలని లేదంటే కాల్చేస్తామని భద్రతా బలగాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే చాలా మంది మావోయిస్టులను మట్టుబెట్టింది. మిగిలినవారిని కూడా ఎన్‌కౌంటర్ చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. మరోవైపు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలన్న పిలుపుతో కొందరు మావోయిస్టు నేతలు ఇప్పటికే లొంగిపోయారు. ఇందులో ఆశన్న, మల్లోజుల లాంటి అగ్ర మావోయిస్టులు సైతం ఉన్నారు.



**బర్సె దేవా లొంగుబాటుపై సస్పెన్స్**

అయితే మరో అగ్ర మావోయిస్టు బర్సె దేవా అలియాస్ సుక్కు తాజాగా లొంగిపోయినట్లు తెలుస్తోంది. కాకపోతే ఈ ఆపరేషన్‌లో సస్పెన్స్ కొనసాగుతోంది. హిడ్మా ఎన్ కౌంటర్ తర్వాత తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా పోలీసులు జరిపిన రాయబారంలో బర్సె దేవా లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం ఉంది. కానీ పోలీసులు అధికారికంగా ప్రకటించకపోవడంపై బర్సె దేవా అసలు అరెస్ట్ అయ్యారా.. లేదా అనే సస్పెన్స్ కొనసాగుతోంది. మరో రెండు రోజుల్లో ప్రకటన వెలువడుతుందని కొందరు పోలీసులు చెప్పుకుంటున్నారు. ఇక బర్సెపై రూ. 50 లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది.

**హిడ్మాతో కలిసి 15 ఏళ్లు ఆపరేషన్లు**

కాగా బర్సె దేవా.. హిడ్మాతో కలిసి దాదాపు 15 ఏళ్లు పని చేసినట్లు సమాచారం. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ 1వ నెంబర్ బెటాలియన్ కమాండెంట్ గా హిడ్మా పని చేశారు. ఆయన పదోన్నతిపై కేంద్రకమిటీలోకి వెళ్లిన తర్వాత ఆ బాధ్యతలను బర్సె దేవా చేపట్టారు. ఈ బాధ్యతతో పాటు అదనంగా స్టేట్ మిలిటరీ కమిషన్‌గా కూడా వ్యవహరించారు. తొలుత దర్బా డివిజన్ కమిటీ సెక్రటరీ స్థాయిలోనూ దేవా పని చేశారు. ఆ తర్వాత 1వ బెటాలియన్ కమాండెండ్ బాధ్యతలను సైతం చేపట్టారు. అలా పలు ఆపరేషన్‌లో కీలక పాత్ర వహించారు. సీఆర్పీఎఫ్ జవాన్లపై జరిపిన కాల్పుల్లో బర్సె దేవా ప్రమేయం ఉన్నట్లు అప్పట్లో ఛత్తీస్‌గఢ్ పోలీసులే చెప్పడం చర్చనీయాంశమైంది.

*** తెలంగాణ పౌర హక్కుల సంఘం కీలక డిమాండ్**

మరోవైపు బర్సె లొంగుబాటుపై పోలీసులు స్పష్టత ఇవ్వాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం కోరుతోంది. వెంటనే కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తోంది. బర్సె లొంగుబాటుపై మరో రెండు రోజుల్లో పోలీసులు క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

### తెలంగాణలో రెండు రోజులు

## చలితీవ్రత తగ్గే అవకాశం



హైదరాబాద్: తెలంగాణలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగి.. చలి తీవ్రత తగ్గిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నుంచి ఐదు డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగినట్లు తెలిపింది. రాష్ట్రంలోకి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు ప్రవేశించడం వల్ల దట్టమైన పొగమంచు కమ్మేస్తోందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. రెండు, మూడు రోజులు చలి ప్రభావం తక్కువగా ఉంటుందన్నారు. నాలుగో రోజు నుంచి ఉత్తర గాలులు ప్రారంభమై.. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతుందని వెల్లడించారు.

## యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలి

*** మంత్రి వివేక్ వెంకటస్వామి**

రాబోయే ఏడాదికి స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో కృత్రిమ మేధస్సు ఆధారిత కోర్సులు సహా కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించాలని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులకు సూచించారు. గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలు పెంచేలా అన్ని కొత్త కోర్సులు ప్రస్తుతంతో పాటు భవిష్యత్



పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. పరిశ్రమల ప్రమాదాలను నివారించేందుకు ఫ్యాక్టరీల శాఖ భద్రతా ప్రమాణాలు, సన్నద్ధతను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సిగాచీ ఘటన కార్మికుల భద్రత, సంక్షేమంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టంచేశారు. అదేవిధంగా ఈఎస్ఐ తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని బీమా చేసిన వ్యక్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఐపీల నుంచి ఫిర్యాదులు రావడం సహించబోమని, అవసరమైన చోట అదనపు డిస్పెన్సరీలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సేవలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ శాఖల అధికారులు సచివాలయంలోని కలిశారు. వారి శుభాకాంక్షలను స్వీకరిస్తూ, అధిక బాధ్యత, నిబద్ధత తో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతం

హైదరాబాద్: గెలుపోటములు తాత్కాలికమని.. ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ తిరోగమనం ప్రారంభమైందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో పార్టీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. ‘‘యూరియా కోసం రైతులు చలికి వణుకుతూ క్యూలైన్‌లో ఉన్నారు. భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై మనపై కత్తులు దూస్తున్నాయి. మనల్ని తుదముట్టించేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు మనల్ని ఎవరూ ఏం చేయలేరు. మనం విజయం సాధిస్తాం.. ధర్మం మనవైపు ఉంది’’ అని కేటీఆర్ అన్నారు.





# ప్రత్యర్థి ఎ, బి ఫారాలు చింపి తినేశాడు!

మహారాష్ట్రలో ఓ వింత సంఘటన జరిగింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో.. శివసేన పార్టీకి చెందిన అభ్యర్థి తన ప్రత్యర్థి 'ఎ', 'బి' ఫారాలను చింపి తినేశాడు. దీనిపై పోలీసు కేసు నమోదు కాగా.. ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ధంకవాడి సహకర్‌నగర్ వార్డు కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఈనెల 15న ఇక్కడ మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన పార్టీ పుణె నగరంలోని 34వ వార్డు స్థానానికి గాను.. ఇద్దరు అభ్యర్థులు ఉద్ధవ్ కాంబ్లీ, మచ్చీంద్ర ధవాలేలకు 'ఎ', 'బి' ఫారాలను ఇచ్చింది. ఇది కాస్తా వారి మధ్య వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో కాంబ్లీ.. ధవాలే నుంచి నామినేషన్ ఫారాలు లాక్కొని వాటిని చింపి నమిలేశాడు. ధవాలే ఫిర్యాదు మేరకు కాంబ్లీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## ప్రధాని పేరిట మెయిల్స్.. రంగంలోకి సీబీఐ

తనకు ప్రధాని మోదీ ఆశీస్సులు ఉన్నాయని, స్వదేశీ యుద్ధవిమానం ఇంజిన్‌ను రూపొందించాలనుకుంటున్నట్లు రక్షణారంగ సంస్థలు, అధికారులకు ఇమెయిల్స్ పంపిన ఓ వ్యక్తిపై సీబీఐ కేసు నమోదు చేసింది. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌కు చెందిన నిశీత్ కోహ్లీ తనను తాను టెక్స్‌టైల్ కెమిస్ట్రీ ఇంజినీర్‌గా పరిచయం చేసుకునేవాడు. స్వదేశీ యుద్ధవిమానం ఇంజిన్ రూపకల్పనకు సాయపడతానంటూ.. 2024 అక్టోబరు డిసెంబరు మధ్యకాలంలో డీఆర్‌డీవోకు చెందిన ఏడీఈ, ఇస్రో, హెచ్ఏఎల్, ప్రీమియర్స్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ తదితర సంస్థలకు మెయిల్స్ పంపాడు. ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి పేరును ప్రస్తావిస్తూ.. తనకు ప్రధాని మోదీ ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ విచారణ ప్రారంభించింది. స్వప్రయోజనాల కోసం అతడు ప్రిన్సిపల్ కార్యదర్శితోపాటు ఏకంగా ప్రధాని పేరును దుర్వినియోగం చేసిన కేసుగా పరిగణించింది. అతడు తన వ్యక్తిగత మెయిల్ అకౌంట్ నుంచి మెయిల్స్ పంపినట్లు, పలువురు ఉన్నతాధికారులనూ వాటిలో ప్రస్తావించినట్లు గుర్తించింది. 2024 నవంబరులో అప్పటి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఎండీ టీవీ చౌదరీ.. నిందితుడి మెయిల్స్‌కు స్పందించినట్లు తెలిపింది. అదే ఏడాది డిసెంబరులో పెంటగాన్‌లోని అమెరికా నేవీకి చెందిన వైస్ అడ్మిరల్ జార్జ్ ఎం వికాఫ్‌కు కూడా నిందితుడు మెయిల్ చేసినట్లు సీబీఐ గుర్తించింది. సున్నితమైన అంశంపై మెయిల్స్ పంపడం వెనక అతడి ఉద్దేశాలను వెలికితీయడంలో నిమగ్నమైంది.

## 2026 అందరికీ అద్భుతమైన సంవత్సరం కావాలి..
## రాష్ట్రపతి, ప్రధాని ఆకాంక్ష

పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఆశలతో ప్రపంచం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'నూతన సంవత్సరం సందర్భంగా దేశంలో, విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం కొత్త శక్తి, సానుకూల మార్పులకు ప్రతీక. ఆత్మపరిశీలనకు, కొత్త సంకల్పాలు తీసుకొనేందుకు మంచి అవకాశం. ఈ సందర్భంగా దేశాభివృద్ధి, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణపై మన నిబద్ధతను చాటుకుందాం. ఈ 2026



మనందరి జీవితాల్లో శాంతి, సంతోషం తీసుకురావాలని.. మరింత బలైమన, సుసంపన్నమైన భారత నిర్మాణానికి కొత్త శక్తిని నింపాలని ఆకాంక్షిస్తున్నా' **రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.**

'2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ ఏడాది అందరికీ శాంతి, ఆరోగ్యం, ఆనందం శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా. బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే మన సమష్టి సంకల్పాన్ని బలోపేతం చేయాలని కోరుకుంటున్నా' **ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**

'ఈ ఏడాది అందరికీ అద్భుతమైన సంవత్సరం కావాలని కోరుకుంటున్నాను. 2026లో మీ అన్ని ప్రయత్నాలు విజయవంతం కావాలని.. మంచి ఆరోగ్యం, శ్రేయస్సు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నా. సమాజం శాంతి, ఆనందంతో ఉండాలని కోరుకుంటున్నా' **ప్రధాని మోదీ**

## నూతన సంవత్సరం వేళ
## పాక్ డ్రోన్ కలకలం.. ఐఈడీ, డ్రగ్స్ జారవిడిచి..!



నూతన సంవత్సరం వేళ.. నియంత్రణ రేఖ వెంబడి పాక్ డ్రోన్ కలకలం సృష్టించినట్లు తెలుస్తోంది. భారత గగనతలంలోకి ప్రవేశించి ఐఈడీ, మాదక ద్రవ్యాలను జారవిడిచినట్లు సమాచారం. ఈ క్రమంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. కథనాల ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లోని నియంత్రణరేఖ వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. ఖాదీ కర్మదా ప్రాంతంలోకి పాక్ డ్రోన్ చొరబడింది. దాదాపు ఐదు నిమిషాల పాటు అక్కడే చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలోనే ఐఈడీ, మందుగుండు సామగ్రి, డ్రగ్స్‌ను జారవిడిచింది. డ్రోన్ కదలికలను గుర్తించిన వెంటనే భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. డ్రోన్ నుంచి జారిపడిన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏదైనా ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందా అనే కోణంలో ఖాదీ కర్మదాతో సహా పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. ఈ ఘటన పూంఛ్ ప్రాంతంలో జరగబోయే ఉగ్రదాడిలో భాగంగా అనుమానిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. నూతన సంవత్సరంలో పాక్ మద్దతున్న ఉగ్రవాద గ్రూపులు జమ్మూకశ్మీర్‌లో దాడికి ప్లాన్ చేశాయని గతంలో నిఘా వర్గాలు సూచించాయన్నారు. ఈ నేపథ్యంలో భారత సైన్యం జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి నియంత్రణ రేఖ వెంబడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## వందేభారత్ స్లీపర్ @ 180 కి.మీ.

* **హైస్పీడ్ పరీక్షలు పూర్తి.. సీఆర్ఎస్ సంతృప్తి**

దిల్లీ: దేశీయంగా రూపొందించిన వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో దీనికి సంబంధించిన తుది పరీక్షలను బుధవారం నిర్వహించారు. కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య ఈ వేగాన్ని చేరుకోవడం ద్వారా మరో మైలురాయిని అధిగమించినట్లయిందని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. గాజుగ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్లో ఉంచినా.. గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం తొణక్కపోవడాన్ని వీడియో తీశారు. దీనిని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రైలు గమనంలో స్థిరత్వం, కుదుపులు, ప్రకంపనలు, బ్రేకుల పనితీరు, భద్రత ప్రమాణాలు వంటివన్నీ పరీక్షించారు. రైలు పనితీరు సంతృప్తికరంగా ఉందని, ప్రయోగపరీక్ష విజయవంతమైనట్లు సీఆర్ఎస్ ప్రకటించారని రైల్వేశాఖ తెలిపింది. రైల్లో 16 పెట్టెలు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన



(ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, ఆధునిక మరుగుదొడ్లు, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. ప్రయాణికులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ రైళ్లను ఎప్పటినుంచి ప్రవేశపెట్టబోయేదీ ప్రకటించలేదు. సీఆర్ఎస్ అనుమతితో దీనికి మార్గం సుగమం అయిందని మాత్రం రైల్వేశాఖ పేర్కొంది.

## విమానం ఎక్కుతుండగా మద్యం వాసన..
## అదుపులోకి ఎయిరిండియా పైలట్



విమానం ఎక్కుతుండగా మద్యం వాసన రావడంతో ఎయిరిండియా పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. కెనడాలోని వాంకోవర్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పైలట్ నుంచి మద్యం వాసన వస్తోందని గమనించిన విమానాశ్రయ సిబ్బంది ఒకరు కెనడా అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే అతడికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా.. అందులో విఫలమయ్యాడు. దాంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ పైలట్ వాంకోవర్ నుంచి దిల్లీకి వెళ్లాల్సిన విమానాన్ని నడపాల్సి ఉంది. ఈ ఘటనతో అదికాస్తా ఆలస్యమైంది. డిసెంబర్ 23న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా.. దీనిపై దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా స్పందించింది. భద్రతా ప్రొటోకాల్స్‌ను పరిగణనలోకి తీసుకొని వేరే పైలట్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నామని పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లోను సహించబోమని స్పష్టం చేసింది.

## అవినీతి, చొరబాట్లే భాజపా ఆయుధాలు

* **పశ్చిమ బెంగాల్ ఎన్నికలపై అమిత్ షా ప్రణాళిక**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర భాజపా ఎన్నికల సన్నద్ధతను బుధవారం సమీక్షించారు. పార్టీ విజయానికి కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించారు. తృణమూల్ కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడేందుకు చొరబాట్లు, అవినీతి ప్రధాన ఆయుధాలు కాగలవని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. తూర్పు కోల్‌కతాలోని సైన్స్ సిటీ ఆడిటోరియంలో జరిగిన పార్టీ కార్యకర్తలు, నాయకుల అంతర్గత సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారని తెలిసింది. తృణమూల్



పాలనలో అవినీతి, చొరబాట్లు వ్యవస్థీకృతమైనట్టు ఆయన పేర్కొన్నారని సమాచారం. ''మీ మనసులపై రాసుకోండి. ఈసారి మన ప్రభుత్వం రాబోతోంది'' అని అమిత్ షా అన్నట్లు పార్టీ కార్యకర్తలు తెలిపారు. 294 మంది సభ్యులు కలిగిన శాసనసభలో తమ పార్టీ మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తుందని అమిత్‌షా మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే.

**ఐక్యంగా ఉండండి..**

పార్టీకి చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి షా ప్రసంగిస్తూ.. పార్టీ సమైక్యంగా ఉందన్న భావన ప్రబలేలా పనిచేయాలని అన్నారు. ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ప్రముఖ స్థానం ఆక్రమిస్తారని స్పష్టం చేశారు. కొన్నినెలలుగా భాజపా కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న దిలీప్ ఘోష్ తాజాగా పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంస్థాగత బాధ్యుల సమావేశానికి హాజరయ్యారు.

## 2026లోనైనా మంచి పాలన అందించండి: ఖర్గే

దిల్లీ: భాజపా పాలనలో 2025లో దేశం అనేక సమస్యలను ఎదుర్కొందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. నూతన సంవత్సరంలోనైనా ప్రజలకు మంచి పాలన అందించాలని కేంద్రానికి సూచించారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మరోవైపు 2025కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ కమలదళంపై 'ఎక్స్'లో ఖర్గే విమర్శలతో విరుచుకుపడ్డారు. ఉపాధి హామీ, ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ఎన్నికల ప్రక్రియ, అంతర్జాతీయ వ్యవహారాలు సహా మొత్తం 14 అంశాలను తన సుదీర్ఘ పోస్టులో ప్రస్తావించారు. ఎంజీనరేగాను రద్దు చేయడం ద్వారా కోట్ల మంది పేదల జీవనాధారాన్ని ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. సరైన సన్నాహాలు లేకుండా, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వకుండా చేపట్టిన ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతో కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం తలెత్తిందని విమర్శించారు.

* **స్పష్టమైన సంస్కరణల ఫలితం: భాజపా**

ఖర్గే విమర్శలపై భాజపా దీటుగా స్పందించింది. మోదీ సర్కారు చేపట్టిన స్పష్టమైన సంస్కరణల ఫలితంగానే భారత్



ప్రపంచంలోకెల్లా నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

## 70 ఏళ్ల వయసులో 700 కి.మీ సైకిల్ యాత్ర.. ఎమ్మెల్యేకు ప్రధాని ప్రశంసలు

ఏడు పదుల వయసులో 702 కి.మీ. మేర సైకిల్ యాత్ర నిర్వహించిన భాజపా ఎమ్మెల్యే ఎస్. సురేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు. బెంగళూరు నుంచి కన్యాకుమారి వరకు ఐదు రోజుల్లో ఆయన సైకిల్‌పై ప్రయాణించారు. న్యూరో సమస్యలతో కొన్నినెలలపాటు మంచానికే పరిమితమైన దశ నుంచి కోలుకుని.. ఈ యాత్రను విజయవంతంగా పూర్తి చేయడం గమనార్హం. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేకు ప్రధాని మోదీ ఫోన్ చేసి అభినందించారు. ''బెంగళూరు నుంచి కన్యాకుమారి వరకు సురేశ్ కుమార్ చేపట్టిన సైకిల్ యాత్ర స్ఫూర్తిదాయకం. అనారోగ్య సమస్యలను అధిగమించిన అనంతరం ఈ ఘనతను సాధించడం.. ఆయన పట్టుదలను చాటిచెబుతోంది. ఫిట్‌నెస్ సందేశాన్ని కూడా ఇస్తోంది'' అని ఎక్స్ వేదికగా పోస్ట్ కూడా పెట్టారు. ప్రధాని మోదీ ఫోన్ చేయడంపై అంతకుముందు ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. ''51 ఏళ్ల తర్వాత.. అదీ అనారోగ్యం నుంచి కోలుకున్న అనంతరం కన్యాకుమారికి ఇది నా రెండో సైకిల్ యాత్ర. ఈ విషయం తెలుసుకుని ప్రధాని సంతోషించారు'' అని తెలిపారు. కర్ణాటకలోని రాజాజీనగర్ నుంచి సురేశ్ కుమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. భాజపా తమిళనాడు మాజీ అధ్యక్షుడు అన్నామలై సైతం ప్రశంసించారు.

## పెరుగనున్న సిగరెట్లు, బీడీ, పాన్ మసాలా ధరలు..

### ఫిబ్రవరి 1 నుంచి అమలు



**న్యూఢిల్లీ:** సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు పెరుగనున్నాయి. వాటిపై జీఎస్టీతోపాటు అదనపు సెస్ విధించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు పేర్కొంది.

కాగా, ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధిస్తారు. బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. అలాగే పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం కూడా విధిస్తారు. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు ఉంటుంది. గతంలో ఉన్న కంపన్‌సేషన్ సెస్సు స్థానంలో ఈ కొత్త సెస్సు అమలు చేస్తారు.

మరోవైపు చూయింగ్ టొబాకో, జర్దా సెంటెడ్ టొబాకో, గుట్కా ప్యాకింగ్ యంత్రాలు (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలను కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడిచింది. దీంతో వాటి తయారీ మెషిన్స్‌పై కూడా అదనపు పన్నులు ఉంటాయి.

అయితే పాన్ మసాలా తయారీపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్, పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను డిసెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించింది.

## కొత్త ఏడాది బిగ్ షాక్..

### భారీగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర



**న్యూఢిల్లీ:** కొత్త ఏడాది తొలిరోజే వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు బిగ్ షాక్ ఇచ్చాయి. ఇప్పటికే పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులపై మరో భారం మోపాయి. దేశవ్యాప్తంగా వాణిజ్య అవసరాలకు ఉపయోగించే సిలిండర్ ధరను భారీగా పెంచాయి. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరపై రూ.111 బాదాయి. ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబై, హైదరాబాద్ సహా అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో కొత్త ధరలు నేటి నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించాయి.

ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా ఇవాళ కూడా సవరించిన ధరలను ప్రకటించాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1691.50కు పెరిగింది. కోల్‌కతాలో రూ.1,795, ముంబైలో రూ.1,642.50, చెన్నైలో రూ.1,849.50కి పెరిగింది. అయితే, కాస్త ఊరటనిచ్చే విషయం ఏంటంటే.. గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. గత కొన్ని రోజులుగా వీటి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదల హోటళ్లు, రెస్టారెంట్లు, చిరు వ్యాపారులపై మరింత భారం పడనుంది.

## కొత్త ఏడాది తొలి రోజున ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

### 2026 తొలి ట్రేడింగ్ సెషన్‌లో ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

### స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, లాభాల్లో నిలిచిన నిఫ్టీ

### పొగాకుపై పన్నుల భయంతో 10 శాతానికి పైగా పతనమైన ఐటీసీ షేరు

### అమ్మకాల గణాంకాలతో రాణించిన ఆటోమొబైల్ రంగం

### కొత్త ఏడాది తొలిరోజు ఇన్వెస్టర్ల అప్రమత్తత



**ముంబై:** 2026 క్యాలెండర్ సంవత్సరంలో తొలి ట్రేడింగ్ సెషన్‌ను దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగించాయి. దేశీయ, అంతర్జాతీయంగా బలమైన సానుకూల సంకేతాలు కొరవడటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 32 పాయింట్ల స్వల్ప నష్టంతో 85,188.6 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 16.95 పాయింట్ల లాభంతో 26,146.55 వద్ద ముగిసింది.

కొత్త ఏడాది తొలిరోజు సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఎఫ్‌ఎంసీజీ రంగంలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లపై ప్రభావం చూపింది. పొగాకు ఉత్పత్తులపై ఫిబ్రవరి 1 నుంచి ప్రభుత్వం అదనపు పన్నులు విధించనుందనే ఆందోళనలతో ఐటీసీ షేరు దాదాపు 10 శాతం పడిపోయింది. దీంతో నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ ఇండెక్స్ 3.17 శాతం నష్టపోయి, ఆ రోజు అత్యధికంగా నష్టపోయిన రంగంగా నిలిచింది. మరోవైపు, ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు డిసెంబర్ 2025 అమ్మకాల గణాంకాలను ప్రకటించడంతో నిఫ్టీ ఆటో ఇండెక్స్ ఒక శాతానికి పైగా లాభపడింది. ఐటీ, మెటల్, బ్యాంకింగ్, రియాల్టీ రంగాలు కూడా లాభాల్లో ముగిశాయి.

హెవీవెయిట్ స్టాక్స్‌లో ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్ నష్టపోగా, ఎన్టీపీసీ, ఎటర్నల్, లార్సెన్ అండ్ టుబ్రో, పవర్ గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.44 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.05 శాతం నష్టపోయింది.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 26,000-26,050 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని, ఈ స్థాయి పైన ఉన్నంత వరకు సానుకూల ధోరణి కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

## వన్డే జట్టు 2025

# కెప్టెన్‌గా రోహిత్..




### టాపార్డర్ బ్యాటర్లుగా కోహ్లీ, రూట్..!

**న్యూఢిల్లీ:** వన్డేల్లో వీరకొట్టుడుతో అభిమానులను అలరిస్తున్న భారత క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 'ఈఎస్‌పీఎన్ వన్డే జట్టు 2025కు ఎంపికయ్యారు. నిరుడు టీమిండియాకు ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన హిట్‌మ్యాన్‌కు కెప్టెన్సీ దక్కగా.. దక్షిణాఫ్రికాపై శతకాలతో రెచ్చిపోయిన కోహ్లీ బ్యాటింగ్ ఆర్డర్లో మూడో స్థానం కాపాడుకున్నాడు. 2025లో వన్డేల్లో అదుతేంగా రాణించిన 11 మందితో గురువారం ఈఎస్‌పీఎన్ జట్టును ప్రకటించింది. అందులో భారత్ నుంచి రో-కోకు మాత్రమే చోటు దక్కింది.

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా చెలరేగిపోతున్న భారత సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఈఎస్‌పీఎయన్ జట్టులో చోటు సంపాదించారు. కెప్టెన్, ఓపెనర్‌గా రోహిత్ ఎంపికవ్వగా.. అతడికి జోడీగా దక్షిణాఫ్రికా కుర్రాడు మాథ్యూ బ్రీట్జ్‌ను తీసుకున్నారు. మూడో స్థానంలో కోహ్లీ, నాలుగో స్థానానికి జో రూట్ సెలెక్ట్ అయ్యారు.

నిరుడు సెంచరీలతో రెచ్చిపోయిన విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ క్రికెటర్ గ్లెన్ ఫిలిప్స్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా చోటు దక్కించుకున్నాడు. మిచెల్ శాంట్నర్, హ్యాట్ హెన్రీ(న్యూజిలాండ్) బౌలింగ్ యూనిట్‌లో నిలిచారు. ఇంగ్లండ్ స్టార్లు ఆదిల్ రషీద్ స్పిన్నర్‌గా, జోఫ్రా ఆర్చర్, జైడెన్ సీల్స్(వెస్టిండీస్) పేస్ బౌలర్లుగా వన్డే జట్టు ఆఫ్ ది ఇయర్ 2025కు ఎంపికయ్యారు.

**వన్డే జట్టు ఆఫ్ ది ఇయర్ 2025 :** రోహిత్ శర్మ(కెప్టెన్), మాథ్యూ బ్రీట్జ్, విరాట్ కోహ్లీ, జో రూట్, షాయ్ హోప్(వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, మ్యాట్ హెన్రీ, జైడెన్ సీల్స్.

## ఉజ్జయిని మహాకాలేశ్వరుడి సన్నిధిలో భారత క్రికెటర్లు..



**న్యూఢిల్లీ:** కొత్త ఏడాది రోజున భారత మహిళా క్రికెటర్లు ఉజ్జయిని మహాకాలేశ్వరుడిని దర్శించుకున్నారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, షఫాలీ వర్మ, అరుంధతి రెడ్డిలు గురువారం ఇక్కడి ప్రసిద్ధ జ్యోతిర్లింగానికి పూజలు చేసి శివయ్య అనుగ్రహం పొందారు. 'భస్మ హారతి'లో పాల్గొన్న టీమిండియా స్టార్లు ఈ ఏడాది తమకు అన్నీ శుభాలే కలగాలని దైవాన్ని ప్రార్థించారు. అనంతరం ఆలయ పూజారి భారత క్రికెటర్లకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్‌ను ఒడిసిపట్టి చరిత్ర సృష్టించిన టీమిండియా పొట్టి సిరీస్‌లో శ్రీలంకను వైట్‌వాష్ చేసింది. విశ్వ విజేతగా తొలి సిరీస్‌ను అజేయంగా ముగించిన భారత జట్టు 2025కు ఘనంగా వీడ్కోలు పలికింది. తదుపరి టీ20 ప్రపంచకప్ లక్ష్యం సాగుతున్న భారత క్రికెటర్లు కొత్త ఏడాది రోజున దైవదర్శనంతో తన్మయం చెందారు. మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని ప్రసిద్ధ మహాకాలేశ్వరుడి ఆలయాన్ని స్మృతి మంధానతో కూడిన బృందం దర్శించుకుంది. మంధానతో పాటు రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్, స్నేహ్ రానా ఉన్నారు.

## సిడ్నీ టెస్టులో ఖవాజా..

### ఆస్ట్రేలియా స్క్వాడ్ ఇదే..!

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్‌ను గెలుపొందిన ఆస్ట్రేలియా నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో విజయంపై కన్నేసింది. మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ షాకివ్వడంతో క్లీన్‌స్వీప్ అవకాశాన్ని చేజార్చుకున్న ఆతిథ్య జట్టు 4-1తో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. సిడ్నీ టెస్టులో ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టాలనే ఉద్దేశంతో కొత్త ఏడాది మొదటి రోజే కంగారూ ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చారు. ఆనవాయితీకి విరుద్ధంగా ఈసారి మ్యాచ్‌కు మూడు రోజుల ముందే క్రికెట్ ఆస్ట్రేలియా తమ స్క్వాడ్‌ను ప్రకటించింది. అయితే.. స్టీవ్ స్మిత్ సారథిగా 15 మందితో కూడిన బృందంలో ఏ మార్పులు చేయలేదని ఆ దేశ బోర్డు వెల్లడించింది.

స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాల తర్వాత తొలి ఓటమి ఎదురైంది ఆస్ట్రేలియాకు. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించిన ఆసీస్.. మెల్‌బోర్న్‌లో మాత్రం తడబడింది. క్రిస్మస్ తెల్లారి జరిగిన బాక్సింగ్ డే టెస్టులో జోష్ టంగ్ విజృంభణతో కంగారూ బ్యాటర్లు తోకముడించారు. దాంతో 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైన స్టీవ్ స్మిత్ బృందం సిడ్నీలో పంజా విసరాలనుకుంటోంది. సిరీస్‌లో ఆఖరిదైన ఈ టెస్టులో చెలరేగి 4-1తో ట్రోఫీ అందుకోవాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది.



ఓపెనర్ నుంచి మిడిలార్డర్‌కు పడిపోయిన ఉస్మాన్ ఖవాజా సిడ్నీ టెస్టు తర్వాత వీడ్కోలు పలుకుతాడనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇంగ్లండ్ విషయానికొస్తే.. .. 14 ఏళ్ల తర్వాత మెల్‌బోర్న్‌లో విజయంతో సిరీస్‌లో బోణీ చేసింది. కుర్రాళ్లు జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ రాణించడంతో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టిన ఇంగ్లండ్ .. సిడ్నీలోనూ గెలుపుపై ధీమాగా ఉంది. జనవరి 4న సిడ్నీ మైదానంలో ఇరుజట్ల మధ్య చివరి టెస్టు జరుగనుంది.

**ఆస్ట్రేలియా స్క్వాడ్:** స్టీవ్ స్మిత్(కెప్టెన్), ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, మార్నస్ లబూషేన్, అలెక్స్ క్యారీ(వికెట్ కీపర్), బ్రెండన్ డగెట్, కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, టాడ్ మైఖేల్ నెసెర్, జై రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్, స్కాట్ బొలాండ్.

## ఆస్ట్రేలియా స్క్వాడ్‌లో ఆర్సీబీ హిట్టర్..

### సీనియర్లకు మరో ఛాన్స్..!

**సిడ్నీ:** స్వదేశంలో యాషెస్ సిరీస్ కైవసం చేసకున్న ఆస్ట్రేలియా పొట్టి ప్రపంచకప్ లక్ష్యంగా పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించింది. సీనియర్లు, జూనియర్ల మేళవింపుతో గురువారం క్రికెట్ ఆస్ట్రేలియా 15 మందిని ఎంపిక చేసింది. గాయం నుంచి కోలుకుంటున్న ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్‌లు స్క్వాడ్‌లోకి వచ్చారు. మిచెల్ మార్ష్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న వరల్డ్‌కప్

మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా మరోసారి పొట్టి కప్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది. అందుకని సన్నాహక సిరీస్‌తో కలిపి వరల్డ్ కప్ కోసం 15 మందిని ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఇటీవలే భారత్‌పై చెలరేగిపోయిన కూపర్ కొన్నెల్లి. బార్ట్‌లెట్, మాథ్యూ కుహ్నెమన్ వంటి కుర్రాళ్లకు వరల్డ్ కప్ బెర్తు దక్కింది.

'ఇటీవల టీ20ల్లో ప్రదర్శనను, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని స్క్వాడ్‌ను ఎంపిక చేశాం. భారత్, శ్రీలంకలోని పరిస్థితులకు సరిపోయే ఆటగాళ్లకు ప్రాధాన్యమిచ్చాం. హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్‌ల ఆరోగ్యం మెరుగుపడుతోంది. ఈ ముగ్గురు ప్రపంచకప్‌లో ఆడుతారని నమ్ముతున్నాం. అయితే.. ఇది ప్రిలిమినరీ స్క్వాడ్ మాత్రమే. మార్పులు చేర్పులు జరిగే అవకాశముంది' అని చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ తెలిపాడు.

ఐపీఎల్ 19వ సీజన్ మినీ వేలంలో రికార్డు ధర (రూ.25.20 కోట్లు) పలికిన కామెరూన్ గ్రీన్, బిగ్‌బాష్ లీగ్‌లో గాయపడిన ఆర్సీబీ హిట్టర్ .. ఊహించనట్టుగానే స్క్వాడ్‌లోకి వచ్చారు. అలానే సీనియర్లు మిచెల్ మార్ష్ సారథ్యంలోని ఆసీస్ జట్టు ప్రపంచకప్ కంటే ముందు పాకిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. పాక్‌తో సిరీస్‌లో కమిన్స్, హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ ఆడే అవకాశముంది.వచ్చే ఫిబ్రవరి 7 భారత్, శ్రీలంక వేదికగా టీ20 ప్రపంచకప్ మొదలవ్వనుంది. గ్రూప్ బీలోని ఆస్ట్రేలియా తమ మ్యాచ్‌లను శ్రీలంకలోని కొలంబో, పల్లెకెలె స్టేడియాల్లో ఆడనుంది.



ఆస్ట్రేలియా టీ20 ప్రపంచకప్ స్క్వాడ్ : మిచెల్ మార్ష్(కెప్టెన్), ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, టిమ్ డేవిడ్, కామెరూన్ గ్రీన్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, గ్జావియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నొలి, ప్యాట్ కమిన్స్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, మాథ్యూ కహ్నెమన్, ఆడం జంపా.

## సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో
# పవన్ కొత్త సినిమా



**టాకీస్:** కొత్త ఆశలు.. అంచనాలతో సినీ తారలందరూ 2026కు స్వాగతం పలికారు. ఈ న్యూ ఇయర్‌కు పవన్ కల్యాణ్ అభిమానులకు గుడ్‌న్యూస్ చెబుతూ గిఫ్ట్ ఇచ్చారు. ఆయన హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఒక సినిమా రానున్నట్లు నిర్మాత రామ్ తాళ్లూరి అధికారికంగా తెలిపారు. పవన్ కళ్యాణ్ పేరు పెట్టిన సంస్థ.. జైత్ర రామ్ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా రానున్నట్లు పోస్టు పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ఇక ఈ ఏడాది ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలని, నటీనటుల ఖాతాల్లో హిట్‌లు పడాలని కోరుకుంటూ మూవీ టీమ్స్ కొత్త సినిమా పోస్టర్లను షేర్ చేశాయి. అగ్ర, యువ కథానాయకులకు సంబంధించిన కొత్త సినిమాల అప్‌డేట్‌లు, లుక్స్‌తో సినీ ప్రియులు నెట్టింట పండగ చేసుకుంటున్నారు.

## స్పిరిట్ నుంచి
# ప్రభాస్ లుక్ విడుదల

టాకీస్: ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' నూతన సంవత్సరం సందర్భంగా డార్లింగ్ అభిమానులకు దర్శకుడు సందీప్ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. మూవీలోని ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతారంలో ప్రభాస్ కనిపించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయి ఉండగా, బ్యాండ్-ఎయిడ్‌లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడ్డారు. ఆయన ముందు త్రిప్తి దిమ్రి నిలబడి ఉంది. రా అండ్ రస్టిక్‌గా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. చూడడానికి 'యానిమల్'లో రణబీర్ పాత్ర ఛాయలు కనిపిస్తున్నా, ప్రభాస్ కటౌట్ కావడంతో అంతకు మించిన హైఓల్టేజ్ యాక్షన్




చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. 'ఇండియన్ సినిమా.. మీ ఆజానుబాహుడు/ఆజానుబాహు'ను చూడండి. హ్యాపీ న్యూఇయర్ 2026' అని సందీప్ వంగా పేర్కొన్నారు. 'మీరు ఇప్పటివరకూ ఉన్న దానిని ప్రేమించారు. ఇక నుంచి మీకు తెలియనిదానితో ప్రేమలో పడండి' అని టీమ్ పేర్కొంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. సినిమా ప్రారంభం సందర్భంగా 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ప్రభాస్ అకాడమీ టాపర్ అయిన ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్టు తెలుస్తోంది. పోలీసు అధికారి అయినా రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్‌కీ, ప్రభాస్‌కీ మధ్య సంభాషణ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఇందుకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్ పంచుతాయని తెలుస్తోంది. ఇదే కథకు ప్రాణమని, మొత్తం సినిమాను మలుపు తిప్పే ఎపిసోడ్ అవుతుందని అంటున్నారు. దీనిపై స్పష్టత రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఇందులో త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. టి - సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్ సంస్థలపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్ నిర్మిస్తున్నారు.



# ఒకే ఒక్క హిట్..

## పాన్ ఇండియా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా రుక్మిణీ వసంత్!

టాకీస్: 'పుష్ప' తర్వాత నేషనల్ క్రష్ ఐడెంటిటీని తీసుకున్న రష్మిక మందన్న.. ఆల్మోస్ట్ పాన్ ఇండియా సినిమాలే చేస్తోంది. ఒకవేళ ఒక భాషలో చేస్తే.. ఆ సినిమాను ఇతర భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. 'థామా' విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు రష్మిక బాటలోనే నడుస్తోంది యువ హీరోయిన్ రుక్మిణీ వసంత్. రుక్కు ఖాతాలో 'కాంతారా: చాప్టర్ 1' తప్ప చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్స్ లేకపోయినా.. క్రేజీ ప్రాజెక్ట్స్ అమ్మడి చేతిలో ఉన్నాయి. 'సప్త సాగారాలు దాటి'తో పాపులరైన రుక్మిణీ వసంత్.. ఇప్పటి వరకు కన్నడలో తప్ప మరో భాషలో హిట్ కొట్టలేదు. అయినా సరే మేకర్స్ ఆమెకు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ కట్టబెడుతున్నారు. కేవలం కన్నడ అనుకుంటే పొరపాటు.. టాలీవుడ్, కోలీవుడ్ కూడా ఆమెకు ఫిదా అయిపోయినట్లే కనిపిస్తోంది. రుక్కు స్క్రీన్ ప్రజెన్స్, ఇన్నోసెంట్ ఫేస్, క్యూట్ ఎక్స్ ప్రెషన్స్‌తో ఆడియన్స్ దిల్ దోచేస్తుండటంతో మేకర్స్ వరుసగా అవకాశాలు ఇస్తున్నారు. రుక్మిణీ వసంత్ ప్రస్తుతం కన్నడలో 'టాక్సిక్' ఫిల్మ్‌లో పవర్ ఫుల్ రోల్ చేస్తోంది. తెలుగులో ప్రశాంత్ నీల్- ఎన్టీఆర్ మూవీలో నటిస్తోంది. తమిళంలో మణిరత్నం సినిమాకు కమిటయ్యిందని సమాచారం. లేటెస్ట్ బజ్ ప్రకారం.. రామ్ చరణ్, సుకుమార్ కాంబోలో తెరకెక్కుతోన్న ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా ఆమె పేరునే పరిశీలిస్తున్నారట. నెక్స్ ఇయర్ సెకండాఫ్ నుంచి మూవీ పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్స్ సంగతి పక్కన పెడితే.. ఈ లైనప్ చూస్తుంటే పాన్ ఇండియా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా రుక్కు మారినట్లుగా కనిపిస్తోంది.

## కొందరు నా ఫెయిల్యూర్
# కోరుకుంటున్నారు
### రాజాసాబ్ డైరెక్టర్ మారుతి వ్యాఖ్య

**టాకీస్:** సంక్రాంతి బరిలో నిలవనున్న 'ది రాజాసాబ్' ప్రచారంలో మారుతి బిజీగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ హారర్ కామెడీ చిత్రం జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మారుతి ఒక ఆసక్తికర ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'మీరు విజయం సాధించకూడదని కొందరు కోరుకుంటున్నారు. ఈ సినిమాకు కూడా ఆదరణ రాకూడదని అనుకుంటున్నారు. వాళ్లు అలా ఎందుకు ఆలోచిస్తున్నారు' అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. తాను ఎదిగితే బిజీ అయిపోతానని కొందరు అలా భావిస్తున్నారని అన్నారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు కోరుకుంటారు. పక్కింటి వాళ్లు కారు కొనుక్కుంటే దానికి ఏదైనా అవ్వాలని కోరుకోవచ్చు. ఈర్ష్య, అసూయ మానవ నైజం. నేను విజయం సాధించి ఎదిగితే వాళ్లకు దొరకనేమో అనే భయంతోనే అలా అనుకుంటారు. నేను ఇప్పుడు చిన్న సినిమాల ఈవెంట్లకు వెళ్తున్నాను. ఒకవేళ నాకు భారీ సక్సెస్ వస్తే అలా రానేమో అని వాళ్ల భయం. వాళ్లు అసూయ వల్ల అలా అనుకుంటున్నారు కానీ.. నేను అలా ఆలోచించేవాడిని కాదు. ఈసారి కథ చెబుదామని నా దగ్గరకు వస్తే నేను పట్టించుకోనేమో.. అదే ఫెయిల్ అయితే మనల్ని చూస్తాడని వాళ్లు అనుకుంటున్నారని మారుతి అన్నారు. 'ది రాజాసాబ్' తర్వాత చిన్న సినిమా



తీయాలనుకుంటే తీస్తాను. చాలా కథలు ఉన్నాయి. అగ్ర నటుడితో తీశాను కదా.. అన్నీ ఆ స్థాయిలోనే తెరకెక్కించాలి అనే కోరికలు లేవు. నాకు కథ ముఖ్యం. ఏ హీరో సెట్ అవుతారు అనుకుంటే ఆయనతో తీస్తాను. ఎప్పుడూ పని ఉండాలని మాత్రం కోరుకుంటానని చెప్పారు.

## సైకలాజికల్
# హారర్ మూవీ 'హనీ'

టాకీస్: నవీన్ చంద్ర, దివ్య పిళ్ళై కీలక పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ సైకలాజికల్ హారర్ మూవీ 'హనీ'. శేఖర్ స్టూడియోస్ సమర్పణలో క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మాణంలో దర్శకుడు కరుణ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రియల్ లైఫ్‌లో జరిగిన పలు సంఘటనలను ఆధారంగా చేసుకుని రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే ఆసక్తికరమైన బజ్‌ను క్రియేట్ చేస్తోంది. న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ నేడు 'హనీ' మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ ఎలిమెంట్స్‌ను కలగలిపి, ప్రేక్షకులను భయపెట్టే విధంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు గ్లింప్స్ ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా కథను రూపొందించడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. గ్లింప్స్‌లో కనిపించే విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల ప్రవర్తన అన్నీ కలిసి ఓ డిస్టర్బింగ్, మిస్టీరియస్ వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నాయి. నవీన్ చంద్ర పాత్ర చాలా డిఫరెంట్ షేడ్స్‌తో ఉండబోతుందని, దివ్య పిళ్లై క్యారెక్టర్ కథలో కీలక మలుపులు తిప్పబోతుందనే సంకేతాలు గ్లింప్స్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు కరుణ కుమార్



గతంలో రియలిస్టిక్ టచ్‌తో కథలను చెప్పిన అనుభవాన్ని ఈసారి హారర్ జానర్‌లో ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.'హనీ' సినిమా ఫిబ్రవరి 6న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హారర్ సినిమాలకి కరెక్ట్ సీజన్‌లో ఈ సినిమా రావడంతో మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.